కాలనీ బతుకులు ఇంతేనా..!?

- ఎంప్లాయీస్, సదాశివనగర్ కాలనీల్లో సమస్యల తిష్ట
- పన్నులు కడుతున్నా.. పట్టించుకోని అధికార యంత్రాంగం
- నాలుగు దశాబ్దాలుగా తాగునీరు, డ్రైన్లు, రోడ్లు నిల్
- కాలనీ ఏర్పడినప్పటి ట్రాన్స్‌ఫార్మరే దిక్కు


డ్రైన్లు లేక, మట్టి రోడ్లతో ఉన్న సదాశివనగర్


కాలనీలో నిరుపయోగంగా ఉన్న పార్కు స్థలం

సామర్లకోట: పట్టణ శివారులో లారీ స్టాండ్ వెనుక ప్రాంతంలో నివసిస్తున్న ఎంప్లాయీస్, సదాశివ నగర్ కాలనీల ప్రజలు అనేక సమస్యలతో సమత మతమవుతున్నారు. సామర్లకోట–పెద్దాపురం మున్సిపాలిటీల కూడలి ప్రదేశంలో, సామర్లకోట శివారు ప్రాంతంలోని లేఅవుట్‌లో అనేక మంది స్థలాలను కొనుగోలు చేసుకుని ఇళ్లను నిర్మించుకున్నారు. ఈ కాలనీలో 40 ఏళ్ల నుంచి అనేక మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు నివసిస్తున్నా, వారి సమస్యలను పట్టించుకునే నాథుడే కానరావడం లేదు. ఈ క్రమంలో ఆదివారం ఈ ప్రాంతంలో వన మహోత్సవం పేరిట తమ సమస్యలను ఏకరువు పెట్టాలని కార్యక్రమం ఏర్పాటుచేశారు. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూపించాలని నిర్ణయించారు. కాలనీల్లో కల్వర్టులు, రోడ్లు, డ్రైన్లు, తాగు నీరు, పార్కులు వంటి సదుపాయాలు లేవని ఆయా కాలనీల వాసులు తెలిపారు. కాలనీలు ఏర్పడిన సమయంలో వేసిన ట్రాన్స్‌ఫార్మరే ఇప్పటికీ ఉందని చెప్పారు. ప్రస్తుతం మూడు రెట్లు జనావాసాలు పెరగడంతో, నిత్యం లోఓల్టేజ్ సమస్య తలెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన పార్కు కోసం ఏర్పాటు చేసిన స్థలంలో మురుగునీరు చేరి దోమలు విపరీతంగా పెరిగిపోయాయని వాపోయారు.

చందాలు వేసుకుని..

పార్కు స్థలాల్లో తుప్పలు పెరిగిపోవడంతో ఆ ప్రాంత వాసులు చందాలు వేసుకుని, జేసీబీల సాయంలో తుప్పలను తొలగించారు. ఆ ప్రాంతంలో ఎమ్మెల్యేతో మొక్కలు నాటే వన మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భాస్కర్‌నగర్ ప్రాంతం నుంచి వస్తున్న మురుగునీరు ఈ ప్రాంతంలోకి చేరి, అది ముందుకెళ్లే అవకాశం లేకపోవడంతో వర్షాలు వచ్చిన సమయాల్లో మురుగు నీటిలోనే నివసించాల్సి వస్తోందని సదాశివనగర్ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ సమీపంలో కార్పొరేట్ కళాశాల, రెండు హైస్కూళ్లున్నాయి. ఆ రోడ్ల మీదుగా నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు వివిధ వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. కాలనీల్లో పందులు, కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందంటున్నారు.

పరిష్కారం శూన్యం



గత పాతికేళ్లుగా కాలనీ సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. మున్సిపాలిటీ నుంచి తాగునీరు అందడం లేదు. రోడ్లు, డ్రైన్ల సమస్య ఎక్కువగా ఉంది. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందికరంగా ఉంటోంది. మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా, కాలనీలను పట్టించుకోవడం లేదు. పార్కులను అభివృద్ధి చేస్తే వాటికి ఎమ్మెల్యే పేరు పెడతాం.
– ఏలేటి రమేష్, ఎంప్లాయీస్, సదాశివనగర్ కాలనీ అధ్యక్షుడు, సామర్లకోట

సమస్యలను పరిష్కరిస్తా..



కాలనీలో ఉన్న అన్ని సమస్యలను క్రమంగా పరిష్కరిస్తా. 40 ఏళ్లుగా సమస్యలుంటే, పోరాటం చేయకపోవడం వింతగా ఉంది. సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లాలి. పార్కులో మొక్కలు వేస్తాం. వాటి పరిరక్షణ బాధ్యత కాలనీ వాసులదే. కాలనీకి వచ్చే కల్వర్టుతో పాటు, రోడ్ల నిర్మాణానికి నిధులు వెంటనే విడుదల చేస్తా. అందరూ కలిసి నిధులను సద్వినియోగం చేసుకోవాలి.
– నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే, పెద్దాపురం

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. పట్టణ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలతో అజెండా రూపొందించినట్టు చెప్పారు. దీనిపై చర్చించడానికి కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలన్నారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆర్డీఓగా శ్రీరమణి బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: కొత్త ఆర్డీఓగా కె.శ్రీరమణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన జె.సీతారామారావును జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ కావడంతో, ఆయన స్థానంలో శ్రీరమణి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారిణిగా, ఇంచార్జ్ డీఆర్వోగా పనిచేశారు. తొలుత ఆమె డీటీగా, తహసీల్దార్‌గా పలు ప్రాంతాల్లో పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓకు కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

శరన్నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట


రాట ముహూర్త పూజ చేస్తున్న విశ్వనాథ్

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రామంలో ఉన్న శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వచ్చే నెల 3 నుంచి నిర్వహించే శరన్నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్ పూజలు చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. 8న విద్యార్థులతో సరస్వతీ పూజలు 10న మహిళలతో సామూహిక అష్టలక్ష్మీ పూజలు జరుగుతాయని చెప్పారు. 12న విజయదశమిని పురస్కరించుకుని పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు నువ్వుల వెంకట్రాజు, ఆచంట సత్యనారాయణ, నువ్వుల బాబ్జి, సూర్యచంద్రరావు, తోటకూర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న సంతర్పణ

సామర్లకోట: పట్టణంలోని ఏడో వార్డులో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ నాయకులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. లారీ ఓనర్స్ సంఘ మాజీ అధ్యక్షుడు ముత్యం రాజబాబు, శెట్టిబత్తుల దుర్గారావు, కౌన్సిలర్ బలుసు వాసు, జిల్లా కబడ్డీ సంఘ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు

సామర్లకోట: పట్టణంలోని ఆరో వార్డులో ఉన్న కనకదుర్గ ఆలయం ఇటీవల వర్షాలకు కూలిపోయింది. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం ఆలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజప్ప రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆలయ విశిష్టతను కమిటీ నాయకులు శ్రీనివాసు, ముత్యం రాజబాబు ఆయనకు వివరించారు. అనంతరం రాజీవ్ గృహకల్ప కనకదుర్గ ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

నేషనల్ సెమినార్‌లో గౌరినాయుడికి సత్కారం


గౌరినాయుడిని సత్కరిస్తున్న ప్రముఖులు

కొత్తపల్లి: రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, స్ఫూర్తి కుటుంబం–ఆంధ్ర ప్రదేశ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పిఠాపురం పట్టణానికి చెందిన సాహితీవేత్త, రచయిత, రాచకొండ నరసింహశర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ కిలారి గౌరినాయుడు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. గురు విశ్వస్ఫూర్తి రచనలు, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై ప్రసంగించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసరావు, ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్, సదస్సు కన్వీనర్ సత్యనారాయణ ఆయనకు ప్రమాణ పత్రం, జ్ఞాపికతో సత్కరించారు.

ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డులు

- రైల్వే శాఖ అధికారుల చర్యలు
- కొలిక్కి వచ్చిన సమస్య !


రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


స్టేషన్ సెంటర్‌లో డ్రైన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సామర్లకోట: స్టేషన్ సెంటర్‌లోని ఆక్రమిత స్థలాల్లో రైల్వే శాఖ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. బడ్డీ షాపులు తొలగించిన ప్రదేశం రైల్వే శాఖకు చెందినదని, దానిని ఆక్రమణ చేస్తే చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు ఆదివారం ఆ బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పటి వరకు ఆయా స్థలాల్లో చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని, వ్యాపారాలు చేసుకుంటున్న వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ముంపు సమస్యను దృష్టిలో ఉంచుకుని ఇటీవల స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైనులో పూడికతీత సందర్భంగా ఆయా దుకాణాలను తొలగించారు. ఈ నేపథ్యంలో ఆయా దుకాణదారులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం సాయంత్రం స్టేషన్ సెంటర్‌లోని డ్రైను ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. గత 40 ఏళ్లుగా రోడ్డు మార్జిన్‌లో తాము బడ్డీలు ఏర్పాటు చేసుకుని, చిరు వ్యాపారాలు చేసుకుంటున్నామని దుకాణదారులు వివరించారు. తొలగించిన షాపుల ఏర్పాటుకు అనుమతిచ్చేలా మాట్లాడామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే వారికి నచ్చజెప్పారు. స్టేషన్ సెంటర్‌లో కొందరు స్థలాలను ఆక్రమించి, రోజువారీ అద్దెకు ఇస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, అటువంటి పరిస్థితులుంటే చర్యలుంటాయని హెచ్చరించారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న కరెంట్ స్తంభాన్ని షాపులు దాటి వస్తే చర్యలుంటాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమస్య కొలిక్కిరావడంతో దుకాణదారులు ఊపిరిపీల్చుకున్నారు.

జెడ్పీ స్కూల్‌లో తుప్పలతో తిప్పలు


సామర్లకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో పెరిగిన తుప్పలు

సామర్లకోట: నిర్లక్ష్యం కారణంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తుప్పలు పెరిగిపోయాయి. దాంతో పాఠశాల ఆవరణతో పాటు, తరగతి గదుల్లోకి పాములు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా వర్షాలు కురుస్తుండడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయని బాలికలు వాపోతున్నారు. దాంతో మరుగుదొడ్లకు వెళ్లాలంటే భయం వేస్తోందని చెబుతున్నారు. పాఠశాల ఆవరణలో పెరిగిపోతున్న తుప్పలను మండల పరిషత్ అధికారులు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సాయంతో తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రిక్షా స్టాండ్ స్థలాన్ని కాపాడండి

సామర్లకోట: బస్సు కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న డ్రైను వద్ద రిక్షా స్టాండ్ స్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్, పట్టణ అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు నేతల హరిబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన రిక్షా కార్మికులు సంఘంగా ఏర్పడగా, వారికి రిక్షా స్టాండ్ ఉండేదని చెప్పారు. స్టాండ్ షెడ్ కూలిపోవడంతో ఆ స్థలం ఆక్రమణకు గురైందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యునైటెడ్ టీచర్స్ క్రికెట్ లీగ్ విజేత పిఠాపురం


విజేతగా నిలిచిన పిఠాపురం జట్టు

పిఠాపురం: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా గొల్లప్రోలులో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో కాకినాడ జిల్లా స్థాయి యునైటెడ్ టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, పెదపూడి. జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాలకు సంబంధించి జట్లు పోటీల్లో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్‌లో పిఠాపురం, కాకినాడ సిటీ జట్లు తలపడగా, పిఠాపురం విజేతగా నిలిచింది. అక్టోబర్‌లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. ఈ పోటీలను యూటీఎఫ్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి చక్రవర్తి, అధ్యక్షుడు నగేష్ ప్రారంభించారు.

రైల్వే క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉండాలి

ఐఆర్‌సీటీసీ, స్టేషన్‌లో స్టాళ్లను తనిఖీ చేసిన అధికారులు


సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఐఆర్‌సీటీసీ విభాగాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం రైల్వే అధికారులు స్థానిక రైల్వే స్టేషన్‌లోని క్యాంటీన్లు, ఫుడ్ స్టాళ్లను అధికారులు తనిఖీ చేశారు. ఐఆర్‌సీటీసీలో ఆహారం తయారీ, ప్యాకింగ్ విధానాలు, నాణ్యత, తూకాలను పరిశీలించారు. ఆహారాన్ని ప్యాకింగ్ చేసే సమయంలో నాణ్యతతో ఉండటంతో పాటు, చేతికి గ్లౌజులు ధరించాలని సూచించారు. సిబ్బంది పరిశుభ్రంగా ఉండటంతో పాటు, పరిసరాలను, వంట పాత్రలు, ఆహార పదార్థాలు నిల్వ చేసే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆదేశించారు. ప్రయాణికులకు వేడి పదార్థాలు మాత్రమే విక్రయించాలన్నారు. ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్లాట్‌ఫాంపై ఉన్న స్టాళ్లను తనిఖీ చేశారు. ప్రతి స్టాళ్లలో ధరల పట్టిక ఉండే విధంగా చూడాలన్నారు. ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు ఉంటాయన్నారు. ప్లాట్‌ఫాం శుభ్రంగా ఉండే విధంగా స్టాళ్ల నిర్వాహకులు పర్యవేక్షించాలన్నారు. ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్ రామకృష్ణ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, టిక్కెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ అజీజ్, టిక్కెటు కలెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో కల్వర్టుపై శిథిలమైన శ్లాబు రాళ్లు


కుళాయిల కోసం తవ్వి వదిలేసిన గోతులు

తవ్వి వదిలేశారు

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

కొత్తపల్లి: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ప్రజానీకానికి ప్రమాదకరంగా మారుతున్నాయి. స్థానిక గాదులదొడ్డిలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు వేసేందుకు కాలువల కోసం గోతులు తీసి వదిలేశారు. వీధుల్లోకి వెళ్లే డ్రైనేజీ కల్వర్టుపై రాళ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. గత పది రోజులుగా స్థానికులు నడిచివెళ్లేందుకు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు ప్రయాణించేందుకు వీల్లేకపోవడంతో, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. రాత్రి వేళల్లో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. కల్వర్టుపై శ్లాబు రాళ్లను ఏర్పాటు చేసి. తవ్విన కాలువను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్–1	దేవర
లలితా స్క్రీన్–2	సత్యం సుందరం
వీరభద్ర	దేవర
శోభా	భలే ఉన్నాడే
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్–1	దేవర
అనుశ్రీ స్క్రీన్–2	దేవర
విఘ్నేశ్వర	మత్తు వదలరా 2
పిఠాపురం	
అన్నపూర్ణ	మత్తు వదలరా 2
పూర్ణ	టూ షోస్ చెక్ లేట్
పూర్ణ 2	దేవర
శ్రీసత్య	దేవర
శ్రీవెంకటేశ్వర	దేవర
ఉప్పాడ	
శ్రీనివాస	మత్తు వదలరా 2

ఉప్పుటేరు వంతెన.. ముప్పు తెచ్చేనా..!


ఉప్పాడ–కోనపాపపేట బీచ్ రోడ్డులో రామన్నపాలెం ఉప్పుటేరుపై ప్రమాదకరంగా ఉన్న వంతెన


వంతెనపై ధ్వంసమైన రక్షణ గోడలు

కొత్తపల్లి: ఉప్పాడ–కోనపాపపేట బీచ్ రోడ్డులో రామన్నపాలెం ఉప్పుటేరుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా ధ్వసమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై తరచూ వందలాది వాహనాలు ప్రయాణిస్తాయి. ముఖ్యంగా వేటకు వెళ్లే మత్స్యకారులు ఈ వంతెన వద్ద బోట్లు నిలిపి, సరకులు తీసుకువెళుతుంటారు. మత్స్య సంపదను తీసుకువస్తుంటారు. దీంతో వంతెనపై తరచూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. అంతేకాకుండా ఎదురెదురు వాహనాలు వచ్చినా కూడా రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వంతెనపై కూలిపోయిన రక్షణ గోడలను పునర్నిర్మించాలని, రోడ్డుపై గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.


వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

సేవా కార్యక్రమాలపై అవగాహన ఉండాలి



క్లబ్ జిల్లా డైరీని ఆవిష్కరిస్తున్న ఈశ్వరకుమార్ తదితరులు

సామర్లకోట: లయన్స్ క్లబ్ చేసే సేవా కార్యక్రమాలపై సభ్యులకు అవగాహన ఉండాలని క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ అన్నారు. క్లబ్‌లో నూతనంగా చేరిన సభ్యులకు స్థానిక రైతు భవనంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది 250 మంది సభ్యులు కొత్తగా చేరారన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను సభ్యులు చేస్తారని తెలిపారు. అటువంటి అవసరాలున్న వారిని గుర్తించాలన్నారు. కంటి పరీక్షలకు అత్యంత ప్రాధాన్యమివ్వడంతో పాటు, సుగర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో లయన్స్ అంతర్జాతీయ ఫ్యాకల్టీ ఎం శ్రీరామ్ సురేష్, మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డి.శ్రీకాంత్, ఉప గవర్నర్ వి.కోటేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, మాజీ గవర్నర్లు ఎం మంగతాయారు, బీవీఎస్ రెడ్డి, కొడూరి రంగారావు, పీఎస్ శర్మ, లింగమల్లు కృష్ణమూర్తి, దాసరి తిరుమలరావు, గ్రంధి వెంకటేశ్వరరావు, గోలి శ్రీరాములు, డాక్టరు బాదం బాలకృష్ణ, జిల్లా గవర్నర్ సలహాదారులు చిత్తాలూరి వీర్రాజు, ఎస్ సూర్యనారా యణరాజు, జిల్లా చైర్మన్ మేకా శ్రీనివాసు, క్లబ్ ప్రతినిధులు ఎస్ఆర్‌వై ఎస్‌కె ప్రసాద్, తుమ్మల సత్యనారాయణ, బడుగు బాబి తదితరులు పాల్గొన్నారు.